క్లుప్తంగా

ఎస్‌ఐల బదిలీ

మదనపల్లె/ములకలచెరువు/పెద్దతిప్పసముద్రం : మదనపల్లె పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐలు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా వన్‌టౌన్ ఎస్‌ఐ ఎస్.అన్సర్‌బాషా, అన్నమయ్యజిల్లా డీసీఆర్బీ విభాగానికి బదిలీ కాగా, టూటౌన్ రెండో ఎస్‌ఐగా పనిచేస్తున్న రవికుమార్ పీటీఎం ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. ములకలచెరువు ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్.గాయత్రి మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐ–2గా బదిలీకాగా, జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో వీఆర్‌లో ఉన్న కే.బి.శివకుమార్, మదనపల్లె వన్‌టౌన్ ఎస్‌ఐగా బదిలీఅయ్యారు. పీటీఎం ఎస్‌ఐగా పనిచేస్తున్న నరసింహుడు ములకలచెరువుకు బదిలీ అయ్యారు.

బాలికల విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

మదనపల్లె సిటీ : బాలికల విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో బాలికల విద్యను ప్రోత్సహించుటలో భాగంగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నయీచేతన కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు ప్రేరణా కార్యక్రమం నిర్వహించారు. రిసోర్సుపర్సన్లు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపకులు మోహన్‌వల్లి, మోహన్‌బాబు మాట్లాడుతూ బాలికల విద్య ఆవశ్యత, వారి విద్యకై ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ఉద్యోగావకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష

రామసముద్రం : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిర్మలాదేవి మాట్లాడుతూ..సాగునీటి చెరువుల పరిధిలోని రైతులను గుర్తించి ఎన్నికల జాబితాను తయారు చేయాలన్నారు. సాగునీటి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ ప్రసాద్, ఏఈ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

నిమ్మనపల్లె : పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మదనపల్లె డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి (ఏడీఏ) శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని తవళం, నిమ్మనపల్లె –2 సచివాలయాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి మురళీమోహన్, కలికిరి కెవికె వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమశేఖర్ శ్రీనివాసులు తో కలిసి నిర్వహించారు. ఫెంగల్ తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీ ప్రసన్న, విఏఏ శ్రీకాంత్,రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ సమావేశం విజయవంతం చేయాలి

తంబళ్లపల్లె : మండలంలోని అన్ని పాఠశాలల్లోను ఈనెల 7వతేదీన నిర్వహించే మెగా పేరెంట్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు కోరారు. మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయంలో టీచర్లకు విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. టీచర్లు విద్యార్థుల ప్రోగ్రెస్‌కార్డులను పూర్తి చేసి పేరెంట్స్ సమావేశంలో విద్యార్థులకు అందజేయాలన్నారు.

ఈ-క్రాప్ నమోదు ద్వారా పంటల బీమా

కలకడ : ఈ–క్రాప్ నమోదు ద్వారాపంటల బీమా వర్తిస్తుందని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బాలయ్యగారిపల్లె, కె.బాటవారిపల్లె పంచాయతీలలో నిర్వహించిన పొలం పి లుస్తోంది కార్యక్రమంలో పాల్గొని పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. బ్యాంకుల ద్వారా రుణం పొందిన రైతులకు బ్యాంకుల ద్వారానే బీమా చెల్లించవచ్చునని తెలిపారు. పంట రుణం పొందని రైతులు మీ సేవా కేంద్రాలలో, రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు.

హరివరాసనం..స్వామి విశ్వమోహనం

- ప్రముఖ క్షేత్రంగా వెలుగొందుతున్న అయ్యప్పస్వామి ఆలయం
- ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్న స్వాములు
- మాలాధారణ భక్తులకు సకల సదుపాయాలు
- నేడు పడిపూజ మహోత్సవం



అయ్యప్పస్వామి ఆలయం



అయ్యప్పస్వామి మూల విగ్రహం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయం కార్తిక మాసం నుంచి మకర సంక్రాంతి వరకు భక్తుల శరణుఘోషతో అలరారుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు మాలాధారణ చేయడంతో పాటు, పద్దెనిమిది మెట్ల గుండా ఇరుముడులు చెల్లిస్తూ ఆలయంలో సందడిగా ఉంటుంది. ప్రశాంత వాతావరణంలో స్వామి వారిని దర్శించుకోవడం మరిచిపోలేని అనుభూతిగా మిగిలిపోతుంది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి చెందారు. మదనపల్లెలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయం రెండో శబరిమలైగా గుర్తింపు పొందింది. ప్రముఖ క్షేత్రంగా వెలుగొందుతోంది. మదనపల్లె పట్టణం అయ్యప్పనగర్‌లోని అయప్పస్వామి ఆలయం 2005లో నిర్మించారు. పట్టణ ప్రముఖులు అందరూ కలిసి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. శబరిమలైలో అయ్యప్పస్వామి నమూనా ప్రకారం ఇక్కడ నిర్మించారు. శబరిమలై ప్రధాన తంత్రి మోహన్‌తంత్రి ఆలయంలో స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయం ఆవరణంలో వినాయకుడు, ఆంజనేయుడు, షిర్డిసాయిబాబా, మాలికాపురత్తమ్మ ఆలయాలతో పాటు నవగ్రహ మండపం ఉన్నాయి.

ప్రత్యేకతలు:

ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. ఆలయం మొదట్లోనే అతి పెద్ద ఆంజనేయుడు, ఈశ్వరుని విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆలయ ధ్వజ స్తంభం వద్ద 18 మెట్లు నిర్మించారు. అయ్యప్పస్వామి ఆలయానికి స్త్రీల ప్రవేశం కూడా ఉంది. పడి పూజలో పాల్గొనే అరుదైన అవకాశం ఉంది. శబరిమలై అర్చకులు, తంత్రిలతో పడిపూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి రోజు పూజలు,అభిషేకాలు నిర్వహిస్తారు. అయ్యప్పమాలాధారుల కోసం ప్రత్యేక గదులు నిర్మించారు. భక్తుల కోసం మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు, ప్రసాద పంపిణీ కేంద్రాలు, హోమాల నిర్వహణకు యాగశాల నిర్మించారు. అయ్యప్పమాలాధారులు ఇక్కడే స్వామికి ఇరుముడులు చెల్లించే సౌకర్యం కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా అయ్యప్పమాలాధారులు ఇరుముడులు చెల్లిస్తున్నారు.

ఏడాది పొడువునా దర్శనం:

శబరిమలై ఆలయాన్ని పరిమిత రోజుల్లోనే తెరిచి ఉంచుతారు. జనవరి 20 తరువాత ఆలయాన్ని మూసివేస్తారు. అయితే మదనపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయం ఏడాది పొడువుగా దర్శనం కల్పిస్తారు. కార్తీకమాసం మొదటి నుంచి దాతల సహకారంతో భక్తులకు రెండు పూటల భోజన సదుపాయం కల్పిస్తున్నారు.

నేడు పడి పూజ మహోత్సవం:

అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం పడిపూజ మహోత్సవంకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి జరిగే పడిపూజ కార్యక్రమానికి శబరిమల మాలికప్పురం మేల్‌శాంత పిఎం.మనోజ్‌స్వామి ఆధ్వర్యంలో పడిపూజ అత్యంత వైభవంగా జరుగుతుంది. పడిపూజకు అయ్యప్ప మాలాధారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఖాళీ కుర్చీలకు శిక్షణ



ఖాళీ కుర్చీలతోనే శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ

బి.కొత్తకోట : గ్రామాల్లో అక్షరాస్యత పెంచడం కోసం ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు బహిష్కరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సీసీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరు కావాల్సివుంది. వీరు అధికారులు ఇచ్చే శిక్షణ పొందాక గ్రామాల్లో పెద్దలకు అక్షరాలను నేర్పించాలి. అయితే తాము విద్యను బోధించే వలంటీర్లుగా విధులు నిర్వర్తించని అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణను బహిష్కరించారు. దీనితో కొద్దిమందే హాజరైన వెలుగు సీసీలకు శిక్షణ ఇచ్చారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పీలేరురూరల్ : మండలంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలని ఎంపీడీఓ జి. శివశంకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు, వీవోఏలకు ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 604 మంది నిరక్షరాస్యులు ఉన్నారని, 60 కేంద్రాల ద్వారా ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఒక్కొక్కరు పది మందికి చొప్పున చదవడం రాయడం నేర్పించాలన్నారు.

తంబళ్లపల్లె : మండలంలోని నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం సంఘమిత్రలకు ఉల్లాస్ యాప్ నిర్వహణపై అవగాహన కల్పించారు.

కలకడ : మండలంలో అక్షరాస్యత శాతం పెంచి, అభివృద్ధి సాధించడానికే ఉల్లాస్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఉల్లాస్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

రామసముద్రం : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు సీసీలకు, వీఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ...15సంవత్సరాలు దాటిన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు.

విద్యా వలంటీర్ల విధులు మాకొద్దు



బి.కొత్తకోటలో అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

బి.కొత్తకోట : అసలే యాప్‌ల భారంతో విధులు నిర్వర్తించలేకపోతున్నాం. ఇప్పుడు మళ్లీ చదువు చెప్పే వయోజన విద్య వలంటీర్ల బాధ్యతలను మేం మోయలేం..ఈ బాధ్యతల నుంచి మమ్మల్ని తప్పించండి అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కొత్త బాధ్యతలు మాకొద్దు, వలంటీర్ విధుల నుంచి తప్పించండి అంటూ నినాదాలు చేశారు. ప్రాజెక్టు పరిధిలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు బి.కొత్తకోట కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయంలో సీడీపీఓ భాగ్యమ్మకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా ఆమె రాయచోటికి వెళ్లినట్లు సిబ్బంది చెప్పడంతో వారికే వినతిపత్రం అందించారు. అనంతరం కార్యాలయం కిందకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ వయోజన విద్య వలంటిర్లుగా ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను ఎంపిక చేసిందన్నారు. ఇప్పటికే తాము ఉన్న బాధ్యతలను నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా పనిభారంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న తమను వయోజన విద్య వలంటీర్ల బాధ్యతలు అప్పగించడం ప్రభుత్వానికి తగదన్నారు. తక్షణమే ప్రభుత్వం తమను ఈ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఆకతాయిల బెడద



బస్టాండు కూడలి వద్ద బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

పెద్దమండ్యం : పెద్దమండ్యం, కలిచెర్ల ప్రాంతాలలోని బస్‌స్టాలు, పాఠశాల సమయంలో పాఠశాలల వద్ద ఆకతాయిల బెడదతో విద్యార్థిని, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వివరాలలోకి వెళితే.. పెద్దమండ్యంలో మోడల్ పాఠశాల, ఉన్నత పాఠశాలలకు చుట్టూ ఉన్న గ్రామాల నుంచి బస్‌లు, ఆటోలలో విద్యార్థినీ, విద్యార్థులు వచ్చి వెళ్తుంటారు. ఆర్‌టీసీ బస్‌లలో వచ్చిన విద్యార్థులు స్థానిక బస్టాండ్ నుంచి అటు మోడల్ పాఠశాలకు, ఇటు ఉన్నత పాఠశాలకు నడుచుకొని వెళ్లాలి. అలాగే సాయంత్రం పాఠశాల వదిలిన సమయంలో బస్టాండ్‌కు విద్యార్థులు నడుచుకొని వస్తుంటారు. ఈ సమయాలలో కొందరు ఆకతాయిలు ద్విచక్రవాహనాలలో అటు, ఇటుగా చక్కర్లు కొడుతుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పెద్దమండ్యం నుంచి పాఠశాలకు వెళుతున్న విద్యార్థినిని ద్విచక్రవాహనంలో వచ్చి ఓ యువకుడు చెయ్యి పట్టి లాగినట్లు సమాచారం. విద్యార్థిని ఇచ్చిన సమాచారంతో ఆమె తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ఆకతాయి కోసం వెతికినట్లు తెలిసింది. అలాగే కలిచెర్లలో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఉదయం, సాయంత్రం పాఠశాల సమయాలలో విద్యార్థులు వారి ఇండ్లకు వెళ్లేందుకు బస్టాండులో వేచి ఉంటారు. ఇక్కడ కొందరు ఆకతాయిలు తమ ద్విచక్రవాహనాలలో వచ్చి చక్కర్లు కొడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమయాలలో ఆకతాయిలపై పోలీసులు నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షం నీరు నిల్వలేకుండా చూడాలి



నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే సమన్వకర్త మంజుల

కలికిరి : ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటలలో వర్షం నీరు నిల్వ లేకుండా రైతులు చర్యలు తీసుకోవాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ మంజుల అన్నారు. వర్షాలు కురిసిన నేపథ్యంలో పంటల రక్షణ చర్యలను మంగళవారం ఆమె రైతులకు వివరించారు. వర్షానికి నేలకొరిగిన వరి పంటను యంత్రాలతో కాకుండా కూలీలతో కోత చేయాలన్నారు. అలాగే రబీ వేరుశనగ సాగుకు ప్రస్తుత వర్షాలు అనుకూలమన్నారు. పంటలకు డ్రిప్ పద్ధతి ఉన్న వారు ట్రైకోడెర్మా, సుడోమోనాస్ మందులను ఎకరానికి లీటరు చొప్పున వేయాలన్నారు. టమటాలో బ్యాక్టీరియా మచ్చతెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా., స్ట్రెప్టో మైసిన్ సల్ఫేట్ 2గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చన్నారు.

అవకతవకల్లో తేల్చిన డబ్బు రికవరీ చేయండి

– డ్వామా పీడీ వెంకటరత్నం



మాట్లాడుతున్న పీడీ వెంకటర్నం

ములకలచెరువు : ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ అవకతవకల్లో సిబ్బంది తేల్చిన రూ.72 వేలు రికవరీ చేయాలని జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఉపాధిహామీ ద్వారా 2023 – 2024 ఆర్థిక సంవత్సరంలో 1813 పనులకు గాను రూ.12.32 కోట్ల పనులపై ఎస్‌ఆర్‌పీ సుబ్బారావు పర్యవేక్షణలోఆరుగురు డీఆర్‌పీలు సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ప్రజావేదికలో వారు గుర్తించిన అంశాలను పంచాయతీల వారీగా వివరించారు. పలు చోట్ల చేపట్టిన పండ్ల తోటల పెంపకంలో మొక్కలు చనిపోయినట్లు ఆర్పీలు పీడీ దృష్టికి తెచ్చారు. మొక్కలు చనిపోయిన చోట మళ్లీ మొక్కలు నాటించాలని సిబ్బందిని పీడీ ఆదేశించారు. అక్కడక్కడా కూలీలు చేపట్టిన పనుల్లో కొలతలు, మస్టర్‌లో వచ్చిన తేడాల కారణంగా గుర్తించిన సొమ్ము రూ. 72,071 వేలు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. పనులు చేపడుతున్న సమయంలో సిబ్బంది చిన్న చిన్న పొరబాట్లు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

456 ఎకరాల్లో పంట నష్టం



వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

గుర్రంకొండ : ఫెంగల్ తుపాను కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో 456 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్కతేల్చారు. ఐదు రోజులుగా కురిసిన వర్షాలకు సరిమడుగు, తరిగొండ, సంగసముద్రం, ఎల్లుట్ల, రామాపురం, గుర్రంకొండ, మర్రిపాడు, నడిమిఖండ్రిగ, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో వరి, టమాటా, కూరగాయలు, పూలతోటలు దెబ్బతిన్నాయి. ఎక్కువ భాగం కోత కొచ్చిన వరి పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. కూరగాయల తోటల్లో కాయలు దెబ్బతిన పంట నష్టం వాటిల్లింది. పూలతోటల్లో పూలు కుళ్లిపోయి రైతులు నష్టపోయారు. ఈనేపథ్యంలో మంగళవారం ఆయా గ్రామాల్లోని సచివాలయ, వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లోపర్యటించి పంట నష్టం వివరాలను సేకరించారు. పంట నష్టంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను స్థానిక వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు అందజేశారు.

10 నిమిషాల్లో ఉల్లాస్ శిక్షణ

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు పలు కార్యాలయాల పరిధిలో ఉన్న సిబ్బందిని కుర్చీల్లో ఆసీనపరచి 'మమ' అనిపించి 10 నిముషాల్లో ముగించారు. వివరాల్లోకి వెళితే వయోజన విద్యలో భాగంగా నిరక్ష్యరాశ్యులను అక్షరాశ్యులుగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం ప్రధానంగా అంగన్‌వాడీ కార్యకర్తలను భాగస్వామ్యం చేస్తూ ఉల్లాస్ శిక్షణను ప్రవేశ పెట్టారు. అయితే ఈ శిక్షణకు కోఆర్డినేటర్లుగా ఉన్న ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, ఏపీఎం హరి, ఎంఈఓ–టూ గోస్‌పీర్‌తో పాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు మాత్రం హాజరు కాగా కీలకమైన అంగన్‌వాడీ కార్యకర్తలు గైర్హాజరయ్యారు. శిక్షణకు డుమ్మా కొట్టిన అంగన్‌వాడీల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే శిక్షణకు గైర్హాజరై బాయ్‌కాట్ చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉల్లాస్ కార్యక్రమానికి అంగన్‌వాడీ కార్యకర్తలను మినహాయించి ప్రత్యామ్నాయంగా వలంటీర్లను నియమించుకోవాలని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

పింఛా నది వద్ద పోలీస్ భద్రత

పీలేరు : వారం రోజులుగా కురిసిన వర్షాలతో గార్గేయ ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయి పింఛానది ప్రవహిస్తోంది. బాలంవారిపల్లె నుంచి నూనెవాండ్లపల్లె మార్గంలో రోడ్డుపైన నది నీరు ప్రవహిస్తుండడంతో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, ఎస్‌ఐ బాలకృష్ణ మంగళవారం తెలిపారు.

ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



చింతపర్తిలో పార్టీ నాయకులతో కలసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి (వాల్మీకిపురం) : ఎడా పెడా ధరలు పెంచేసిన కూటమి ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని చింతపర్తిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్, వలంటీర్లకు పదివేల వేతనాలు వంటి హామీలు ఇబ్బడి ముబ్బడిగా ఇచ్చిన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత హామీల ఊసెత్తకుండా పోయిందన్నారు. ఆరు నెలల అధికారంలో ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కూడా నెరవేర్చలేదని, ఇప్పటికీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప మరేమీ చేయలేదన్నారు. ఉచిత ఇసుక అన్నారు కానీ ప్రజలకు ఎక్కడ ఇసుక దొరకడం లేదన్నారు. పైగా గత ప్రభుత్వంకంటే అధిక ధరలకు ప్రజలు ఇసుక కొనుగోలు చేస్తుండటం చూస్తున్నామన్నారు. అలాగే నాణ్యమైన మద్యం తక్కువ ధరకే ఇస్తామని హామీ ఇచ్చి పాత బ్రాండ్‌లనే అధిక ధరలు వసూలు చేస్తూ మద్యం బాబులను కూడా దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

పరామర్శ

చింతపర్తికి చెందిన డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఇండ్లూరి రెడ్డెప్పానాయుడు భార్య సరస్వతి ఇటీవల మృతిచెందింది. ఈ సందర్భంగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే చింతల వారి స్వగృహానికి చేరుకుని విశ్రాంత ప్రిన్సిపాల్‌ను పరామర్శించారు. అలాగే కలికిరి పట్టణానికి చెందిన పెయింట్ దుకాణం యజమాని అబ్దుల్ కుమారుడు అష్రఫ్(27) సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో ఆసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ళ భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిద్దల కేశవరెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, లక్ష్మీనారాయణ, రవికుమార్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.